



# స్టార్ త్రినేత్రం

PRGI NO: TGTEL/25/A0438

అనుక్షణం అక్షరసత్యం | తెలుగు దినపత్రిక







| వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 361 | ఎడిటర్ : డి.శివకృష్ణ | మంగళవారం | 30-06-2026 | పేజీలు : 04 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|---|
| WARANGAL | VOL : 01 | ISSUE : 361 | EDITOR : D.SHIVAKRISHNA | TUESDAY | 30-06-2026 | PAGES : 04 | PRICE : 2/- |

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, & TG All Districts


## తెలంగాణలో ఐపీఎస్ అధికారుల బదిలీలు

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పోలీసు శాఖలో ఐపీఎస్, ఎస్‌పీఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగులు సోమవారం చేపట్టింది. ఈ మేరకు జీఓ ఆర్.టి. నెం.931ను జారీ చేసింది. పలువురు అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించగా, మరికొందరికి అదనపు బాధ్యతలు కేటాయిం చింది. రామగుండం పోలీస్ కమిషనర్‌గా కొనసాగుతున్న అంబర్ కిశోర్ ఝాకు డీఐజీ, జోన్–1 (కాళేశ్వరం) అదనపు బాధ్యతలు అప్పగించారు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి. జోయెల్ డేవిస్‌కు డీఐజీ, జోన్–5 (యాదాద్రి) బాధ్యతలు కూడా అప్పగించారు.




వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సన్‌ప్రీత్ సింగ్ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ, డీఐజీ జోన్–3 (రాజన్న) అదనపు బాధ్యతలు ఇచ్చారు. హైదరాబాద్ నార్త్ రేంజ్ (లా అండ్ ఆర్డర్) జాయింట్ కమిషనర్‌గా ఉన్న ఎన్.శ్వేతను వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నియమిస్తూ, డీఐజీ జోన్–4 (భద్రాద్రి) బాధ్యతలు కూడా అప్పగించారు. ఇంటెలిజెన్స్ సీఐ సెల్ డీఐజీగా కొనసాగుతున్న ఆర్. భాస్కరన్‌కు జోన్–2 (బాసర) డీఐజీ అదనపు బాధ్యతలు కేటాయించారు. స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ ఎస్.ఎం. విజయ్ కుమార్‌కు

(మిగతా 2లో..)

## సీఎం రేవంత్ రెడ్డి సభ రద్దు

**స్టార్ త్రినేత్రం, ఖమ్మం:**



తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నేడు (మంగళవారం) ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో జరగాల్సిన 'రైతు ఆశీర్వాద సభ' రద్దయింది. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, రైతులకు పెట్టుబడి సాయం అందించే ఈ కార్యక్రమాన్ని నిలిపివేయకుండా, ప్రత్యామ్నాయంగా హైదరాబాద్లోని శిల్పకళా వేదికలో నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ సభను 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించనున్నట్లు పేర్కొంటూ, దీనికి సంబంధించిన ఏర్పాట్లను తక్షణమే పూర్తి చేయాలని మంత్రులకు, ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. (మిగతా 2లో..)

## నితిన్ నబీన్ పర్యటన పూర్తిగా ఫ్లాప్ షో

### టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**



తెలంగాణలో బీజేపీ చీఫ్ నితిన్ నబీన్ పర్యటన పూర్తిగా ఫ్లాప్ షోగా ముగిసిందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ బీజేపీ నాయకులు చిన్న సమావేశాన్ని కూడా సక్రమంగా నిర్వహించలేకపోతున్నారని, అలాంటి పరిస్థితిలో రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. బీజేపీ చీఫ్ నితిన్ నబీన్ పర్యటనపై తాజాగా మహేష్ కుమార్ గౌడ్ స్పందిస్తూ..'అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీ విభజన రాజకీయాలను ఇప్పటికే తిరస్కరించారు. జీహెచ్ఎంసీ గురించి మాట్లాడే ముందు హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వం విధించిన అన్ని అడ్డంకులను తొలగించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై విచారణకు బీజేపీ సిద్ధంగా ఉందా?. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగినట్లు (మిగతా 2లో..)

## కాంగ్రెస్ పని ఖతం..

### తెలంగాణలో వచ్చేది మన ప్రభుత్వమే.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్

**స్టార్ త్రినేత్రం, వరంగల్:**



తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమవుతుందని, కేంద్రం–రాష్ట్రంలో ఒకే పార్టీ ప్రభుత్వం ఉండే 'డబుల్ ఇంజిన్ సర్కార్' ఏర్పడితేనే రాష్ట్ర భవిష్యత్తు మరింత వేగంగా మారుతుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.తెలంగాణ పర్యటనలో భాగంగా సోమవారం నితిన్ నబీన్ వరంగల్ జిల్లాలో పర్యటించి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టిన పనుల గురించి పార్టీ నాయకులు, కార్యకర్తలకు వివరించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సమన్వయంతో పనిచేయాలని సూచిస్తూ, బీజేపీ (మిగతా 2లో..)

## 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

### మంత్రి శ్రీధర్‌బాబు

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వన్ ట్రిలియన్‌కు, భారత స్వాతంత్ర్య శత వార్షికోత్సవం జరిగే (మిగతా 2లో..)



## అభివృద్ధి-మానవీయతను సమన్వయం చేస్తాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధికి, హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే చారిత్రాత్మక ప్రాజెక్టుగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మూసీ నది పునరుజ్జీవంతో నగరానికి కొత్త జీవం పోసేలా, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోందన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ, పునరావాసం తదితర అంశాలపై సచివాలయంలో మంత్రి సోమవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మూసీ నదిని పునరుజ్జీవింపజేసి, దాన్ని పర్యాటకం, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి కేంద్రంగా మార్చాలన్నదే ప్రభుత్వ దూరదృష్టిగా చెప్పారు. ఈ ప్రాజెక్ట్ కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, ఇది భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన, పర్యావరణహితమైన జీవన వాతావరణాన్ని అందించే సంకల్పమన్నారు. కాలుష్యంతో ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వరదల సమయంలో పరివాహక ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుందని తెలిపారు. వరద నియంత్రణ, నీటి శుద్ధి, పచ్చదనం పెంపు, రోడ్లు, పార్కులు, వాక్‌వేలు, వినోద కేంద్రాలు ఏర్పాటు ద్వారా మూసి పరివాహక ప్రాంతాలను సరికొత్త జీవన కేంద్రాలుగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. గతంలోనే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్టుగా మూసీ ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదని, ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందని గుర్తు చేశారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో పేదల జీవితాలు దెబ్బతినకుండా ప్రతి నిర్ణయం మానవీయ కోణంలోనే తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాజెక్టులో భూ సేకరణ ప్రక్రియలో (మిగతా 2లో..)

## హరీశ్‌రావుకు డబుల్ మెంటలా?..

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్




**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే తక్షణమే అసెంబ్లీని రద్దు చేయాలన్న మాజీ మంత్రి హరీశ్ రావుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ప్రభుత్వం రద్దు అంటే హరీష్ రావుకు డబుల్ మెంటలా? అని ప్రశ్నించారు. ఈ రెండున్నరేళ్లలో ఏ ఎన్నిక పెట్టినా కాంగ్రెస్ గెలుస్తూ వస్తోందని.. అవి చూసి కూడా హరీష్ రావు పిచ్చి వ్యాఖ్యలు ఎందుకు? అని మండిపడ్డారు. సోమవారం మీడియాతో నిర్వహించిన చిట్?చాట్?లో మాట్లాడిన మంత్రి.. కేటీఆర్?కు పిచ్చి పట్టిందని ఎంత వాగినా టైం చూసి మందు వేస్తామన్నారు.

**దీపావళి బాంబులపై కట్టుబడి ఉన్నా:**

దీపావళి బాంబులపై నేను ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని మంత్రి స్పష్టం చేశారు. కేటీఆర్?ను అరెస్ట్ చేస్తేనే బాంబులు పేలినట్లు కాదు ప్రజలు ఛీ కొట్టినా బాంబ్ పడ్డట్లేనన్నారు. మేము వేసిన బాంబులు కేటీఆర్?కు ఆల్రెడీ తగిలాయన్నారు. ఫారెస్ట్ ఏరియాల్లో ఒకప్పటి థ్రెట్ ఇప్పుడు లేదని అందుకే ఆర్ఎస్ ప్రవీణ్ కుమర్?కు భద్రత తగ్గించారని చెప్పారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్? (మిగతా 2లో..)

## 20 వేల పోలీస్ పోస్టులను భర్తీ చేయాలి

### మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు వద్ద తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తోన్న నిరుద్యోగులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపడాన్ని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అభ్యర్థులను పోలీసులు రోడ్లపై ఈడ్చుకెళ్లి.. అక్రమంగా అరెస్టులు చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియంతృత్వ ధోరణికి అద్దం పడుతోందని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు హరీశ్ రావు సోమవారం సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేస్తూ.. ఎన్నికల సమయంలో మొదటి ఏడాదిలోనే (మిగతా 2లో..)

# హరీశ్‌రావుకు డబుల్ మెంటలా?..

(మొదటి పేజీ తరువాయి)

తగ్గించినట్లు వెల్లడించారు. తెలంగాణలో బీజేపీకి అధికారం అనేది దింపుడు కల్లం ఆశ అని కిషన్ రెడ్డి పగటి కలలు కనడం మానేయాలన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి, కేబినెట్ లిస్ట్ తయారు చేసుకున్నట్లు అనుకుంటున్నారు. రూరల్ - అర్బన్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి చూపించిందన్నారు.

**వచ్చే ప్రభుత్వంలో సీఎం ఎవరో ఇప్పుడే చెప్పలేం:**

ఈ ప్రభుత్వం మొత్తం ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉంటారు. ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నంబర్ -2గా ఉంటారు. నాకున్న మంత్రి పదవితో సంతృప్తిగా ఉన్నానన్నారు. శాఖల మార్పుపై క్లారిటీ లేదని నాకు ఏ శాఖ ఇచ్చినా సంతృప్తిగా ఉంటానన్నారు. వచ్చే ప్రభుత్వంలో సీఎం ఎవరు అనేది ఇప్పుడే చెప్పలేం... కానీ అందరికంటే ముందు నేనే చెప్తానన్నారు. క్యాడర్?లో అందరూ సంతృప్తిగా ఉండలేరు.. కానీ అందరికీ న్యాయం చేస్తామన్నారు.

**ఇందిరమ్మ స్లాబ్ విషయంపై..**

ఇందిరమ్మ ఇండ్ల స్లాబ్ లెన్త్ పెంపు జీవోపై ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి స్పందించారు. మేస్త్రి లాభం కోసం ఇళ్లకు నాలుగు వైపులా పెంచుతున్నారని స్లాబ్ పెంచడం వల్ల లబ్ధిదారులకే నష్టం అన్నారు. గ్రేటర్ సిటీలో పది అంతస్తుల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మిస్తామని రెండు ఎకరాల్లో 8 టవర్లు నిర్మించే ఆలోచనలో ఉందన్నారు. సిటిలో 23 స్థలాలు 18 నియోజకవర్గల్లో వచ్చేలా ఫస్ట్ ఫేజ్ నిర్మాణం ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. వచ్చే కేబినెట్?లో దీనికి ఆమోదం లభించే అవకాశం ఉందన్నారు. నవంబర్‌లో GHMC ఎన్నికలు అనే చర్చ ఇప్పటికీ లేదని ఈసారి రైతు భరోసా లిమిట్ లేదని వారంలోపే 9వేల కోట్లు ఇస్తామన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి సభ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

**ఇవాళ సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం..**

శిల్పకళా వేదికలో నేడు సాయంత్రం 4 గంటలకు ఈ ప్రతిష్టాత్మక సమావేశం ప్రారంభం కానుంది. మధిర సభ రద్దయినప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులందరినీ ఇందులో భాగస్వాములను చేయాలని ప్రభుత్వం నిశ్చయించింది. ఇందులో భాగంగా, రాష్ట్రంలోని అన్ని జిల్లాల పరిధిలోని రైతులు తమ పరిసర ప్రాంతాల్లోని 'రైతు వేదికల' నుంచీ డిజిటల్/ వర్చువల్ పద్ధతిలో ఈ సమావేశంలో ప్రత్యక్షంగా పాల్గొనేలా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

# నితిన్ నబీన్ పర్యటన పూర్తిగా ఫ్లాప్ షో

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలు ఎదుర్కొంటున్నా సీబీఐ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో నితిన్ నబీన్ సమాధానం చెప్పాలి. తెలంగాణలో బూత్‌లు గెలుస్తాం, కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుస్తాం అని ప్రగల్భాలు పలికే ముందు గ్రౌండ్ రియాలిటీ చూసుకోవాలి. తెలంగాణలో బెంగాల్ తరహా విభజన రాజకీయాలు సాగవని హెచ్చరించిన ఆయన, నగరాల పేర్లు మార్చడంపైనే బీజేపీ దృష్టి ఉందని, ప్రజల జీవితాలను మార్చే అభివృద్ధి ప్రణాళిక మాత్రం కనిపించడం లేదని విమర్శించారు. సుష్మా స్వరాజ్‌పై తమకు గౌరవం ఉన్నప్పటికీ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు చేయవద్దని అన్నారు. వారసత్వ రాజకీయాలను విమర్శించే బీజేపీ, ఎన్నికల అవసరాల కోసం వారసత్వ నాయకులను పార్టీలో చేర్చుకుంటోందని ఆరోపించారు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక ఇబ్బందులు, నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, తెలంగాణకు రావాల్సిన కేంద్ర నిధులు, రాష్ట్ర ప్రాజెక్టుల వంటి కీలక అంశాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే బీజేపీ జాతీయవాదం పేరును ఉపయోగిస్తోందని తీవ్ర విమర్శలు గుప్పించారు.

# అభివృద్ధి-మానవీయతను సమన్వయం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల కోణంలో ఆలోచించి మానవీయ కోణంలో నిర్ణయాలు ఉండాలని అధికారులకు సూచించారు. ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని ఇందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించి తక్షణమే అమలు చేయాలని ఆదేశించారు. భూములు కోల్పోయే వారికి చట్టబద్ధమైన పరిహారం, అవసరమైన పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం ఎటువంటి రాజీ పడబోదని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డీఎస్ లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# 20 వేల పోలీస్ పోస్టులను భర్తీ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి గద్దెనెక్కిందని హరీశ్ రావు విమర్శించారు. తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను పక్కనబెట్టి, హక్కుల కోసం పోరాడుతున్న యువతను అణచివేస్తూ రేవంత్ రెడ్డి రాష్ట్రంలో 'హిట్లర్' పాలనను కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. నిరుద్యోగుల గొంతు నొక్కాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. బీఆర్ఎస్ డిమాండ్లు ఇవే..శాంతియుత నిరసనల్లో అక్రమంగా అరెస్ట్ చేసిన నిరుద్యోగ అభ్యర్థులందరినీ ప్రభుత్వం బేషరతుగా, తక్షణమే విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. అలాగే, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులపై స్వయంగా డీజీపీ ప్రకటన చేసిన నిజాన్ని గుర్తు చేస్తూ.. ఆ 20 వేల పోలీస్ పోస్టులకు వెంటనే పూర్తిస్థాయి నోటిఫికేషన్ విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# తెలంగాణలో ఐపీఎస్ అధికారుల బదిలీలు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ నార్త్ రేంజ్ జాయింట్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) అదనపు బాధ్యతలు అప్పగించారుఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న చి. సింధు శర్మను ఇంటెలిజెన్స్ సీఐ సెల్ ఎస్పీగా బదిలీ చేసి, ఎస్ఐబీ ఎస్పీ బాధ్యతలు కూడా అప్పగించారు. ఎస్ఐబీ ఎస్పీగా ఉన్న వై. సాయి శేఖర్‌ను సికింద్రాబాద్ రైల్వే పోలీస్ ఎస్పీగా బదిలీ చేశారు. హైదరాబాద్ డీసీపీ (ఎస్ఎం అండ్ ఐటీ)గా ఉన్న చెన్నూరి రూపేష్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ చి. ప్రవీణ్ కుమార్లను సీఐడీ ఎస్పీలుగా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆర్. వెంకటేశ్వర్లును హైదరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీగా నియమించారు. వనపర్తి అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఉన్న రాజేష్ మీనాను వికారాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేశారు. వికారాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఉన్న బి. రాములు నాయక్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేసి, డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# దమ్ముంటే చర్చకు రండి..

**స్టార్ త్రినేత్రం, వరంగల్:**

తెలంగాణకు, వరంగల్? అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో ఇదే వరంగల్ గడ్డమీద చర్చకు నేను సిద్ధం అని ఎవరు ఎంత అభివృద్ధి చేశారో లెక్కలు తేలుద్దాం దమ్ముంటే చర్చకు రావాలని కాంగ్రెస్, బీఆర్ఎస్?కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చాలెంజ్ చేశారు. సోమవారం హనుమకొండలో నిర్వహించిన బీజేపీ సభలో మాట్లాడిన ఆయన.. తాను నేరుగా ఢిల్లీ నుంచి వచ్చానని మీకులా అబద్ధపు చాలెంజ్?లతో కాకుండా పక్కా లెక్కలతో వచ్చానన్నారు. మీ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని వరంగల్ నగరాభివృద్ధికి రూ. 17 వేల కోట్లు కేటాయించామని చెప్పారు. వరంగల్?కు రాదనుకున్న రైల్ కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఏడాది వరంగల్ ఎయిర్ పోర్టు పనులు ప్రారంభమవుతాయని, దేశంలో 7 మెగా టెక్స్ టైల్ పార్కులు ఇస్తే అందులో ఒకటి వరంగల్?కు మంజూరు చేశామన్నారు.

# కాంగ్రెస్ పని ఖతం..

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో పాటు పలువురు బీజేపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడిన నితిన్ నబిన్, తెలంగాణలో బీజేపీకి ప్రజల మద్దతు రోజురోజుకూ పెరుగుతోందని, వచ్చే ఎన్నికల్లో ఆ మద్దతు అధికారంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు తెలంగాణ పర్యటనలో భాగంగా భువనగిరి చేరుకున్న నితిన్ నబిన్‌కు పార్టీ పదాధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. తనకు లభించిన ఆత్మీయ ఆదరణ పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న కార్యకర్తల అభిమానానికి తాను ఎంతో ఆనందించానని పేర్కొన్నారు. అదే పర్యటనలో నిర్వహించిన 'వికసిత్ భారత్ స్టూడెంట్ కాంక్లేవ్' కార్యక్రమంలో కూడా నితిన్ నబిన్ విద్యార్థులు, యువతతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. యువతతో నేరుగా సంభాషిస్తూ వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. తెలంగాణ యువతలో అపారమైన ప్రతిభ, సృజనాత్మకత, నైపుణ్యం, అభివృద్ధికి అవసరమైన సామర్థ్యం ఉన్నాయని ఆయన కొనియాడారు. భారతదేశ అభివృద్ధిలో తెలంగాణ యువత కీలక పాత్ర పోషించే శక్తి కలిగి ఉందని అభిప్రాయపడ్డారు. అయితే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇచ్చిన ముఖ్య హామీలను అమలు చేయడంలో విఫలమైందని నితిన్ నబిన్ ఆరోపించారు. ముఖ్యంగా ఉపాధి అవకాశాలు కల్పించడం, అభివృద్ధికి సంబంధించిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదని విమర్శించారు. ప్రతిభ ఉన్నప్పటికీ ప్రభుత్వ విధానాల కారణంగా యువత ఇబ్బందులు ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. తెలంగాణలో అభివృద్ధి, ఉపాధి, మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాల్లో వేగవంతమైన మార్పులు తీసుకురావాలంటే బీజేపీ ప్రభుత్వమే ప్రత్యామ్నాయమని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి డబుల్ ఇంజిన్ సర్కార్ అవసరమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా వివరించాలని నితిన్ నబిన్ సూచించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిస్తూ తన తెలంగాణపర్యటనను కొనసాగించారు.

# 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. తెలంగాణ ప్రస్తుతం దేశ జీడీపీలో దాదాపు 5 శాతం వాటాను అందిస్తున్నదని.. 2047 నాటికి ఈ వాటాను 10 శాతానికి రెట్టింపు చేయాలని భావిస్తున్నామని తెలిపారు. ఈ లక్ష్య సాధనకు పాలన, పరిశ్రమలు, అట్టడుగు స్థాయి ఆర్థిక కార్యకలాపాలలో నూతన సాంకేతికతలను ప్రవేశపెట్టడం కీలకమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని 65 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలు కూడా భాగమని.. వీరికి ఈ ఏడాదే రూ. 21,000 కోట్ల రుణాలు అందించామని.. ఎన్‌పీఏలు దాదాపు సున్నా స్థాయిలో ఉన్నాయని తెలిపారు. రాజకీయ పార్టీలు మారినా కొనసాగుతున్న విధాన స్థిరత్వం, సులభతర వాణిజ్య నిర్వాహణ పెట్టుబడిదారులకు భరోసానిస్తున్నాయని చెప్పారు. టీఎస్ ఐపాస్ సింగిల్ విండో వ్యవస్థ ద్వారా అనుమతులు 21 రోజుల్లోనే మంజూరవుతున్నాయని.. ఇప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0 ద్వారా సాంకేతికత సహాయంతో మరింత పారదర్శకత, పెండింగ్ అనుమతుల రియల్-టైమ్ ట్రాకింగ్ అందుబాటులోకి వచ్చిందని వివరించారు. ఏరోస్పేస్ రంగం ఇప్పుడు ఐటీ, ఫార్మా ఎగుమతులను మించిపోయిందని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్, రాబోయే రీజినల్ రింగ్ రోడ్, వరంగల్, ఆదిలాబాద్‌లలో నిర్మిస్తున్న కొత్త విమానాశ్రయాలు వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ద్వారా జిల్లా కేంద్రాలకు హైదరాబాద్ స్థాయి కనెక్టివిటీని విస్తరించనున్నట్లు తెలిపారు. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నెట్ జీరో కాలుష్య రహిత నగరంగా అభివృద్ధి చేయనున్నారు. ఇందులో 200 ఎకరాల్లో ఏఐ సిటీ, గ్రీన్ ఫార్మా యూనిట్లు, అన్ని తరగతుల వారికి నివాస ప్రాంతాలు, దేశంలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో మొదటి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఉంటాయి. ఎంఎస్ఎంఈల విషయంలో వచ్చే ఐదేళ్ల కోసం రూ. 600 కోట్లు కేటాయించామని.. ప్రతి జిల్లాలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయనున్నామని మంత్రి ప్రకటించారు.

# ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణది దేశంలోనే అగ్రస్థానం

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**




తెలంగాణ రాష్ట్రం బియ్యం ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానంలో ఉందని, బియ్యం ఎగుమతులను భారీ స్థాయిలో ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను పరిశీలిస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు ఇప్పటికే బియ్యం ఎగుమతి చేస్తోందని, బియ్యం మిల్లింగ్ పరిశ్రమకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా వారి వ్యాపార అవకాశాల విస్తరణకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి 300 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఉత్పత్తి అవుతుండగా, రాష్ట్ర వార్షిక వినియోగం కేవలం 36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమేనని తెలిపారు. మనం ఉత్పత్తి చేసే బియ్యంలో పదోవంతు మాత్రమే వినియోగిస్తున్నామని, దీంతో బియ్యం పరిశ్రమ అభివృద్ధికి ఎగుమతులే తదుపరి పెద్ద అవకాశంగా మారాయి. బియ్యం మిల్లర్లు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లను చేరుకునేందుకు వీలుగా ప్రత్యేక బియ్యం ఎగుమతి విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తోంది. సోమవారం కేసీపీ న్యూట్రీ సంస్థ రూపొందించిన మల్టీ విటమిన్ రైస్ ఉత్పత్తులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ బియ్యంలో విటమిన్ ఏ, విటమిన్ బీ1 నుంచి బీ 12, ఐరన్, జింక్ వంటి ఎనిమిది ముఖ్యమైన సూక్ష్మపోషకాలు సమృద్ధిగా ఉన్నాయి. ఈ ఉత్పత్తి కోలం, హెచ్ఎంటీ, సోనా మసూరి వంటి ప్రజాదరణ పొందిన బియ్యం రకాలలో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో బహుళ విటమిన్లతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యం ఉత్పత్తులలో ఇది తొలి ప్రయత్నాల్లో ఒకటిగా నిలుస్తుందని, సాధారణ బియ్యంలానే రుచి, వండే లక్షణాలు కలిగి ఉండి, కీలక సూక్ష్మపోషకాలను అందిస్తుంది. ఆరోగ్యం మాత్రల్లో కాదు, మన భోజన పాత్రలో ఉండాలి. ప్రజలు ప్రతిరోజూ తినే ఆహారం ద్వారా పోషకాహార లోపాలను తగ్గించే సామర్థ్యం ఈ ఉత్పత్తికి ఉందన్నారు. అనంతరం మిల్లర్స్ ఫర్ న్యూట్రిషన్ ఆసియా ప్రోగ్రామ్ లీడర్ మనోజిత్ ఇంద్రా వివరిస్తూ ప్రజలు ప్రతిరోజూ వినియోగించే ఆహారాల ద్వారా పోషకాహారాన్ని మెరుగుపరచడంలో ఫుడ్ ఫోర్టిఫికేషన్ అత్యంత ప్రభావవంతమైన, విస్తరించగల పరిష్కారం. ఫోర్టిఫికేషన్ నాణ్యతను పెంచడం, పోషకాహార ఆహారాల లభ్యతను విస్తరించడం కోసం పరిశ్రమ భాగస్వాములతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. అదే విధంగా కేసీపీ సీఈఓ శ్రీ వైష్ణవి మాట్లాడుతూ.. పోషకాహారం సులభంగా, అందుబాటులో ఉండాలి. న్యూట్రి పోషణ ద్వారా కుటుంబాలు తమ ఆహారపు అలవాట్లు, వంట విధానాలు మార్చకుండా రోజువారీ పోషక అవసరాలను తీర్చుకోగలుగుతాయి. ప్రతి ఇంటి భోజన పాత్రలో ఫోర్టిఫైడ్ రైస్ అందుబాటులో ఉండేలా చేయడమే మా లక్ష్యమన్నారు.

# ఉద్యోగులకు భారీ గుడ్ న్యూస్

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బకాయిల చెల్లింపుల కోసం ప్రభుత్వం సోమవారం మరో రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి (ఆర్థిక శాఖ మంత్రి) మల్లు భట్టి విక్రమార్క సంయుక్తంగా జరిపిన సమీక్ష అనంతరం, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఈ నిధుల విడుదలకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు.

**నెల వ్యవధిలోనే రూ. 4,000 కోట్లు..**

ఉద్యోగ సంఘాల విజ్ఞప్తులు, వారి న్యాయమైన డిమాండ్లను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నిధులను విడతల వారీగా అన్‌లాక్ చేస్తోంది. ఇందులో భాగంగానే గత నెల 29న మొదటి విడత కింద రూ. 2,000 కోట్ల బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే క్లియర్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా సోమవారం మరో రూ. 2,000 కోట్లు విడుదల చేయడంతో.. కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఏకంగా రూ. 4,000 కోట్ల మేర ఉద్యోగుల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం చెల్లించినట్లయింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో పీఎఫ్, జీపీఎఫ్, సరెండర్ లీవ్లు, మెడికల్ బిల్లులతో పాటు రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ నిధుల చెల్లింపులకు మార్గం సుగమమైంది. ప్రభుత్వ ఈ ఆర్థిక ప్యాకేజీపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణలో భారీగా డీఎస్పీల బదిలీలు..

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

తెలంగాణ పోలీస్ శాఖలో భారీ ఎత్తున బదిలీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 36 మంది డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు డీజీపీ సీవీ ఆనంద్ సోమవారం అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం, శాంతిభద్రతల పరిరక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా ఈ బదిలీలు చేపట్టినట్లు పోలీస్ వర్గాలు వెల్లడించాయి. బదిలీ అయిన అధికారులలో పలువురు జిల్లాల సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్లు, సిటీ పోలీస్ విభాగాల్లోని డీఎస్పీలతో పాటు వివిధ కీలక విభాగాలకు చెందిన వారు ఉన్నారు.

PRGI NO: TGTEL/25/A0438
అనుక్షణం అక్షరసత్యం తెలుగు దినపత్రిక

# జీవో నం. 20ను వెంటనే రద్దు చేయాలి..

## రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

## ఎకో టౌన్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా భగ్గుమన్న 16 గ్రామాల ప్రజల







**స్టార్ త్రినేత్రం, రంగారెడ్డి జిల్లా:**
ప్రభుత్వం ప్రతిపాదించిన ఎకో టౌన్ డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సోమవారం ఉదయం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. 'చలో కలెక్టరేట్ ముట్టడి' పేరుతో చేపట్టిన ఈ ఆందోళన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. బాధిత గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ ముట్టడిలో పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనకారులను కలెక్టరేట్ లోనికి అనుమతించకపోవడంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట జరిగింది. చివరకు జిల్లా కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో, నిరసనకారులు అడిషనల్ కలెక్టర్‌కు తమ వినతి పత్రాన్ని సమర్పించారు. బండరావిరాల సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇంచార్జ్ క్యామ మల్లేష్ తదితర ముఖ్య నాయకులు పాల్గొని ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పచ్చగా బతుకుతున్న 16 గ్రామాల సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ప్రభుత్వ 'తుగ్లక్' పాలనకు నిదర్శనమని వారు విమర్శించారు. జపాన్ సహకారంతో బండరావిరాల గ్రామంలోని సర్వే నెంబర్ 268లో సుమారు 494 ఎకరాల్లో జీఓ నెంబర్ 20 కింద ఈ ప్రాజెక్టును అమలు చేయాలని చూడటం దారుణమన్నారు. రాజ్యాంగం ప్రకారం ఇంత పెద్ద ప్రాజెక్టు చేపట్టే ముందు గ్రామ సభలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఆ కనీస బాధ్యతను విస్మరించిందని, పర్యావరణ అధ్యయనం లేకుండానే ప్రజల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తోందని నాయకులు ఆరోపించారు. ఈ 16 గ్రామాల పరిధిలో దాదాపు 60,000 ఎకరాల భూమి ఉందని, దీని విలువ సుమారు ఆరు లక్షల కోట్ల రూపాయలు ఉంటుందని నాయకులు అంచనా వేశారు. డంపింగ్ యార్డు వల్ల ఈ ప్రాంతం పూర్తిగా కలుషితమై ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డు వల్ల ఉత్తర భాగాన జరుగుతున్న నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని, ఇప్పుడు ఉద్దేశపూర్వకంగా ఆ కాలుష్యాన్ని నగరానికి దక్షిణాన ఉన్న ప్రజల మీదకు రుద్దే ప్రయత్నం జరుగుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో 45 శాతం ఆదాయం రంగారెడ్డి జిల్లా నుంచే వస్తోందని, అలాంటి జిల్లాలో ఐటీ, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీలు స్థాపించి అభివృద్ధి చేయాల్సింది పోయి, డంపింగ్ యార్డులు పెట్టి ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజకవర్గాలను కక్షగట్టి నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 20ని రద్దు చేయాలని, పర్యావరణాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజా క్షేత్రంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# గ్రామాల సమస్యలను పట్టించుకోని విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకోవాలి

## పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు వెంటనే ప్రొసీడింగ్స్ జారీ చేయాలని డిమాండ్

## ప్రజావాణిలో కలెక్టర్ కు వినతి

**స్టార్ త్రినేత్రం, సిద్ధిపేట:**
జగదేవపూర్ మండలంలో ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్న విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)పై తక్షణ చర్యలు తీసుకోవాలని, అలాగే కలెక్టర్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న అర్హులైన లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు వెంటనే ప్రొసీడింగ్స్ జారీ చేయాలని తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ పోసాన్‌పల్లి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వట్టిపల్లి ఉప సర్పంచ్ బోనకొల్లూరు నాగరాజు, వార్డు సభ్యుడు కొలనుపాక రాములు తదితరులతో కలిసి జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన అనేక మంది పేద కుటుంబాలు ఇళ్ల సర్వే సమయంలో సాంకేతిక కారణాల వల్ల ఎల్-3 జాబితాలోకి వెళ్లడంతో గృహాల మంజూరు నుంచి దూరమయ్యారని తెలిపారు. ఈ సమస్యపై ఇప్పటికే ఎంపీడీవోతో పాటు జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు వినతులు సమర్పించినప్పటికీ, జస్టిఫికేషన్ నివేదికలు కలెక్టర్ లాగిన్‌లో పెండింగ్‌లోనే ఉండిపోయాయని, ఇప్పటివరకు ప్రొసీడింగ్స్ జారీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి తక్షణమే ప్రొసీడింగ్స్ జారీ చేసి న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా జగదేవపూర్ మండలంలో విద్యుత్ శాఖ ఏఈ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పూర్తిగా విస్మరిస్తున్నారని ఆరోపించారు. తిమ్మాపూర్ గ్రామంలో పలుచోట్ల త్రీఫేజ్ విద్యుత్ లైన్లు ఇళ్లపై నుంచి వెళ్లడంతో ఇప్పటికే విద్యుత్ షాక్ ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. రహదారి పక్కన ఉన్న ఒక విద్యుత్ స్తంభం కేవలం తీగల ఆధారంగా నిలిచి ఉండటంతో ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని, అది సమీపంలోని డీటీఆర్‌పై పడితే గ్రామ ప్రజలకు ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు.




ఈ సమస్యలపై గత మూడు నెలలుగా పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అలాగే వట్టిపల్లి గ్రామంలో ఇళ్లపై నుంచి వెళ్తున్న సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్లను తొలగించాలని ఎన్నిసార్లు కోరినా అధికారులు స్పందించడం లేదన్నారు. గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన ఏఈ కనీస బాధ్యత కూడా నిర్వర్తించడం లేదని ఆరోపించిన వారు, ప్రజల భద్రతను ప్రమాదంలోకి నెట్టే విధంగా వ్యవహరిస్తున్న అధికారిని వెంటనే మండలం నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులకు వెంటనే ప్రొసీడింగ్స్ జారీ చేయడంతో పాటు విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుబాసి సుధాకర్, కె. సురేష్, పైసా స్వామి, గుండ్రు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం

### యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి అధ్యక్షతన సమావేశం

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**
రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం ఇందిరా భవన్‌లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఇన్‌చార్జ్ ఖాలిద్, సహ ఇన్‌చార్జ్‌లు రోషిని జైస్వాల్, భవ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, రాబోయే కార్యక్రమాల అమలుపై దిశానిర్దేశం చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ పిలుపు మేరకు జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్ నాయకత్వంలో నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా "ఛాత్రోన్ కీ గూంజ్" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమన్వయంతో విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అదేవిధంగా జాతీయ యువజన కాంగ్రెస్ తీసుకొచ్చిన నూతన నియమ నిబంధనలను అందరికి వివరించి వీటిని ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. సంబంధిత ఎమ్మెల్యే/నియోజకవర్గ ఇంచార్జ్‌లతో చర్చించి జూలై 15 లోగా డివిజన్ మరియు గ్రామ కమిటీలు పూర్తి చేయాలని ఆదేశించారు.




# భాగ్యలత కాలనీలో ' ఫిట్‌నెస్ క్లబ్' ఘనంగా ప్రారంభం

**స్టార్ త్రినేత్రం, హయత్ నగర్:**




హయత్ నగర్ డివిజన్ భాగ్యలత కాలనీలోని ఐసీఐసీఐ బ్యాంక్ భవనం రెండో అంతస్తులో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఫిట్‌నెస్ క్లబ్' ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. నిర్వాహకులు జి. వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సగర సంఘం ప్రధాన కార్యదర్శి గౌరకంటి సత్యం సాగర్, కాలనీ అధ్యక్షులు సామ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తుంగ నర్సిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి రిబ్బన్ కట్ చేసి జిమ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు వెంకటేష్ ముఖ్య అతిథులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. మారుతున్న జీవనశైలి కారణంగా వస్తున్న ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి వ్యాయామం ఎంతో అవసరమన్నారు. శారీరక దృఢత్వంతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని, యువత వ్యసనాలకు దూరంగా ఉండి ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలని కోరారు. భాగ్యలత కాలనీ పరిసర ప్రాంతాల ప్రజలకు, ముఖ్యంగా యువతకు అత్యాధునిక పరికరాలతో ఈ ఫిట్‌నెస్ క్లబ్ అందుబాటులోకి రావడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. ఫిట్‌నెస్ క్లబ్ నిర్వాహకులు లిజి. వెంకటేష్‌లి మాట్లాడుతూ.. లి"మా ' ఫిట్‌నెస్ క్లబ్'ను 'స్ట్రాంగర్ టుగెదర్' అనే నినాదంతో ప్రారంభించాం. స్థానిక ప్రజలకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన అత్యాధునిక వ్యాయామ పరికరాలను ఇక్కడ అందుబాటులోకి తీసుకువచ్చాం. అనుభవజ్ఞులైన ట్రైనర్ల పర్యవేక్షణలో ప్రతి ఒక్కరికీ ప్రత్యేక శిక్షణ అందించబడుతుంది. ఆరోగ్యకరమైన సమాజ స్థాపనలో మా వంతు పాత్ర పోషించడమే మా లక్ష్యం. పరిసర ప్రాంతాల ప్రజలు, యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని కోరారు. అందరికీ అందుబాటులో ఉండేలా ధరలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు

# 23వ వార్డు బద్ది పోచమ్మ వీధి అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన అక్షరాభ్యాస కార్యక్రమం

### –ఐసిడిఎస్ సీడీపీఓ సౌందర్య ఆధ్వర్యంలో

### –ముఖ్య అతిథిగా 23 వార్డు కౌన్సిలర్ బోనాల సాగరిక శివ

**స్టార్ త్రినేత్రం, వేములవాడ :**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని 23వ వార్డు బద్ది పోచమ్మ వీధి అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన మరియు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం జరిగింది 3 నుండి 5 సంవత్సరాల పిల్లలందరినీ అంగన్వాడి కేంద్రంలోచేర్పించాలని తెలిపారు అంగన్వాడి కేంద్రంలో పోషణ ఆహారం పదార్థాలు ఇవ్వబడును, గర్భిణీ స్త్రీలకు బాలాంతలకు ప్రత్యేక పోషణ పదార్థాలతో కూడిన ఆహారం ఇవ్వబడును అని తెలిపారు మరియు 23 వ వార్డు కౌన్సిలర్ బోనాల సాగరిక శివ మాట్లాడుతూ అంగన్వాడికేంద్రాలలోచేర్పించాలని ప్రభుత్వం ఇస్తున్న పోషణ ఆహార పదార్థాలను పిల్లలకు గర్భిణీ స్త్రీలకు బాలాంతలతో ఇవ్వబడునని ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ తెలిపారు ఈ కార్యక్రమంలో వేములవాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని సౌందర్య మేడం 23వ వార్డు కౌన్సిలర్ బోనాల సాగరిక శివ తల్లులు బాలబాలికలు అంగన్వాడీ టీచర్ మునెమ్మ అంగన్వాడీ హెల్పర్, ఇతర బాలికలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# SMAT సిద్ధిపేట అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఏకగ్రీవఎన్నిక అధ్యక్షురాలిగా బండి సుగుణ

**స్టార్ త్రినేత్రం, సిద్ధిపేట:**
SMAT సిద్ధిపేట అసోసియేషన్ 2026 సంవత్సరానికి సంబంధించిన నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం సిద్ధిపేటలో ఘనంగా నిర్వహించబడ్డాయి. అసోసియేషన్ గౌరవ వ్యవస్థాపక అధ్యక్షుడు కర్రోళ్ల చిరంజీవి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి తదితర పదవులకు ఎన్నికలు నిర్వహించగా, అన్ని పదవులకు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్నేహపూర్వక వాతావరణంలో ముగియడం విశేషం. ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ, గత కార్యవర్గం చేపట్టిన కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లడంతో పాటు సభ్యుల ఐక్యత, సంక్షేమం, సామాజిక సేవా కార్యక్రమాలకు నూతన కార్యవర్గం ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన బండి సుగుణ, సభ్యులందరి సహకారంతో అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రతి సభ్యుడి అభిప్రాయానికి గౌరవం ఇస్తూ, మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచడంతో పాటు సభ్యుల సంక్షేమ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని పేర్కొన్నారు. ఉపాధ్యక్షురాలిగా వుడేం అనిత, ప్రధాన కార్యదర్శిగా స్వామి చరణ్, సహాయ కార్యదర్శిగా మోజెష్, కోశాధికారిగా భూమయ్య, సహాయ కోశాధికారిగా సింహాద్రి, సంయుక్త కార్యదర్శిగా నెమలి సుభాష్ ఎన్నికయ్యారు. సమాచార కార్యదర్శులుగా కూరెళ్ల సంతోష్ కుమార్, రాకేష్ గౌడ్, స్వేచ్ఛ రెడ్డి, దీక్ష బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య సలహాదారులుగా డాకూరి భాస్కర్ రెడ్డి, ఘటం స్వామి, మల్లేశ్, బాలు కరాటే, విజయ, రాందాస్, మల్లేశ్ యాదవ్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా మటన్ రాజు, పవన్, లక్ష్మీ, రాము, సాయి గౌడ్, నరేష్ బాధ్యతలు చేపట్టారు. మీడియా ఇంచార్జ్‌గా చరణ్ రాజ్ సోషల్ మీడియా ఇంచార్జ్‌గా నవీన్ పొట్టి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గౌరవ వ్యవస్థాపక అధ్యక్షుడు కర్రోళ్ల చిరంజీవి మాట్లాడుతూ, అసోసియేషన్ సభ్యులందరూ ఐకమత్యంతో ముందుకు సాగితే సంస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. నూతన కార్యవర్గం సభ్యుల సంక్షేమం, సామాజిక సేవ, యువతకు ప్రోత్సాహం, సంస్థ విస్తరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, ఆహ్వానితులు, పలువురు ప్రముఖులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. సభ్యుల సహకారంతో SMAT సిద్ధిపేట అసోసియేషన్ మరింత అభివృద్ధి సాధించి, సమాజ సేవలో ఆదర్శ సంస్థగా నిలవాలని ఆకాంక్షించారు.

# దేవర తర్వాత మళ్లీ కలయిక.. 'గాడ్ ఆఫ్ వార్'పై భారీ హైప్!

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రాబోయే భారీ మైథలాజికల్ ఫిల్మ్ 'గాడ్ ఆఫ్ వార్' అఫీషియల్ అనౌన్స్‌మెంట్‌కు టైమ్ ఫిక్స్ అయింది. మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రాబోయే భారీ మైథలాజికల్ ఫిల్మ్ 'గాడ్ ఆఫ్ వార్' అఫీషియల్ అనౌన్స్‌మెంట్‌కు టైమ్ ఫిక్స్ అయింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా కన్ఫర్మ్ అవ్వడంతో ఇండస్ట్రీలో హైప్ నెక్స్ట్ లెవెల్‌కి వెళ్ళింది. 'దేవర' లాంటి గ్లోబల్ హిట్ తర్వాత ఎన్టీఆర్, అనిరుధ్ కాంబోలో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ క్రేజీ అప్‌డేట్‌తో సోషల్ మీడియా మొత్తం ఊగిపోతోంది. గతంలో ఎన్టీఆర్, త్రివిక్రమ్ కలయికలో వచ్చిన 'అరవింద సమేత వీర రాఘవ' ఎంతటి ఘనవిజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఇక తారక్ పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్, త్రివిక్రమ్ లోతైన డైలాగ్స్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పించాయి. ఇప్పుడు మళ్లీ ఇన్నాళ్ల తర్వాత ఈ ఇద్దరు దిగ్గజాలు ఒక పౌరాణిక నేపథ్యం ఉన్న కథతో జతకడుతుండటంతో సరికొత్త రికార్డుల వేట మొదలవడం ఖాయంగా కనిపిస్తోంది.



అనిరుధ్‌కు ఫస్ట్ టైమ్ మైథలాజికల్ ఎక్స్‌పీరియన్స్:స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ ఇప్పటివరకు ఎన్నో కమర్షియల్, మాస్ యాక్షన్ సినిమాలకు అదిరిపోయే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు. గతం లో ఎన్టీఆర్ తో దేవర మూవీ తో హిట్ కాంబో అనిపించుకున్నాడు. కానీ ఆయన కెరీర్‌లోనే ఒక భక్తి లేదా పౌరాణిక చిత్రానికి సంగీతం అందించడం ఇదే మొదటిసారి. ఇక లార్డ్ మురుగన్ కాన్సెప్ట్‌తో రాబోతున్న ఈ 'గాడ్ ఆఫ్ వార్' చిత్రానికి అనిరుధ్ ఎలాంటి డివోషనల్ అండ్ పవర్‌ఫుల్ ట్యూన్స్ ఇస్తారో చూడాలని అటు మ్యూజిక్ లవర్స్, ఇటు నందమూరి ఫ్యాన్స్ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ అల్టిమేట్ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థలు హారిక అండ్ హాసిని క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి.ఇక నిర్మాత నాగవంశీ సోషల్ మీడియాలో ఇచ్చిన హింట్స్‌తో అభిమానులు అప్పుడే ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లలో హ్యాష్‌ట్యాగ్స్ ట్రెండ్ చేస్తూ హంగామా మొదలుపెట్టారు. ఎట్టకేలకు ఈరోజు సాయంత్రం 5:04 గంటలకు అఫీషియల్ అనౌన్స్మెంట్ ఇవ్వనున్నారు. ఎన్టీఆర్ మాస్ ఇమేజ్, త్రివిక్రమ్ మేధస్సు, అనిరుధ్ మ్యూజిక్ మ్యాజిక్... ఈ మూడు తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ రావడం గ్యారెంటీ. 'దేవర' క్రేజ్ తర్వాత వస్తున్న ఈ 'గాడ్ ఆఫ్ వార్' టాలీవుడ్‌లోనే వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ విజువల్ వండర్‌గా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరి ఈ సెన్సేషనల్ ప్రాజెక్ట్ కి సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ కోసం మనమూ కాసేపు వెయిట్ చేద్దాం!

# బాలయ్య సినిమా ఆ డెడ్‌లైన్ ను అందుకుంటుందా?



ప్రస్తుతం సినిమా షూటింగ్ కీలక దశలో కొనసాగుతోంది. భారీ యాక్షన్ ఎపిసోడ్స్, ప్రధాన తారాగణానికి సంబంధించిన సీన్స్, సాంగ్స్ షూటింగ్ వంటి పనులు షెడ్యూల్ ప్రకారం పూర్తవ్వాల్సి ఉంది టాలీవుడ్‌లో పండుగ సీజన్‌కు సినిమాను రిలీజ్ చేయడమనేది కేవలం రిలీజ్ డేట్ సెలెక్షన్ మాత్రమే కాదు.. అది ఒక బిజినెస్ స్ట్రాటజీ కూడా. ముఖ్యంగా దసరా, సంక్రాంతి, సమ్మర్ వంటి సీజన్లలో ఆడియన్స్ నుంచి వచ్చే రెస్పాన్స్, థియేటర్లలో లభించే అవకాశాలు, ఫ్యామిలీ ఆడియన్స్ ఫుట్‌ఫాల్ వంటి అంశాలు నిర్మాతలకు భారీ ప్రయోజనాన్ని అందిస్తాయి. అందుకే ఇప్పుడు బాలకృష్ణ నటిస్తున్న ఎన్‌బీకే111 సినిమాను కూడా దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే టార్గెట్ తో చిత్రబృందం వేగంగా పనులు పూర్తి చేస్తోందని సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రస్తుతం సినిమా షూటింగ్ కీలక దశలో కొనసాగుతోంది. భారీ యాక్షన్ ఎపిసోడ్స్, ప్రధాన తారాగణానికి సంబంధించిన సీన్స్, సాంగ్స్ షూటింగ్ వంటి పనులు షెడ్యూల్ ప్రకారం పూర్తవ్వాల్సి ఉంది. దసరా రిలీజ్‌ను అందుకోవాలంటే పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా సమాంతరంగా పూర్తి చేయాల్సి ఉండటంతో మేకర్స్ ఎక్కడా రాజీ పడకుండా దసరా టార్గెట్ ను అందుకోవాలని ప్లానింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పెద్ద సినిమాల్లో చిన్న ఆలస్యం కూడా మొత్తం రిలీజ్ షెడ్యూల్‌ను ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో మేకర్స్ ప్రతి దశను జాగ్రత్తగా ముందుకు తీసుకెళ్తోంది. ఇటీవలి కాలంలో పండుగ సీజన్లను టార్గెట్ గా చేసుకుని స్టార్ హీరోలు వరుసగా తమ సినిమాలను రిలీజ్ చేస్తున్న విషయం తెలిసిందే. అలాంటి సమయంలో ఎన్‌బీకే111 కూడా దసరా బరిలో నిలిస్తే బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. దసరా టైమ్ కు మరికొన్ని సినిమాలు కూడా రిలీజ్ కు ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఇతర భారీ సినిమాలు కూడా అదే సీజన్‌ను టార్గెట్ చేస్తే థియేటర్ల కేటాయింపు, షోల పంపిణీ, సినిమా ఓపెనింగ్స్ మరియు ఫస్ట్ వీకెండ్ కలెక్షన్లపై ప్రభావం పడే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే బాలకృష్ణకు పండుగ సీజన్‌లో విడుదలైన మాస్ ఎంటర్‌టైనర్లు మంచి ఆదరణ పొందిన సందర్భాలు గతంలో చాలానే ఉన్నాయి. అందుకే ఈసారి కూడా అదే సెంటిమెంట్‌ను కొనసాగించాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం. డైరెక్టర్ గోపీచంద్ మలినేనితో ఇప్పటికే సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ ఉండటం, ఇప్పటికే సినిమా నుంచి రిలీజైన కంటెంట్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ రావడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ఒకవేళ ఏదైనా ఆలస్యమై సినిమా అనుకున్నట్టు దసరా టైమ్ కు రాకపోతే రిలీజ్ డేట్ ను కాస్త వెనక్కి జరిపి డిసెంబర్ 4వ తేదీన రిలీజ్ చేయాలని కూడా టీమ్ ప్లాన్-బి ని కూడా రెడీ చేసుకున్నట్టు తెలుస్తోంది. మేకర్స్ మొదటి ప్రాధాన్యం మాత్రం దసరా మార్కెట్‌పైనే ఉందని తెలుస్తోంది. దీంతో ఇప్పుడందరి దృష్టి మేకర్స్ షూటింగ్ డెడ్‌లైన్‌ను అందుకుంటారా? లేక బాక్సాఫీస్ పోరాటం మరికొంత ఆలస్యంగా మొదలవుతుందా? అనే దానిపై నెలకొంది.

# డిప్యూటీ సీఎం త్రిష...నిజమేనా ?



ఇపుడు దేశంలో డిప్యూటీ సీఎంల లిస్ట్ పెరుగుతోంది. ఈ పోస్టులలోకి వస్తున్న వారు కూడా క్రేజ్ ఉన్న వారే ఉంటున్నారు.ఇపుడు దేశంలో డిప్యూటీ సీఎంల లిస్ట్ పెరుగుతోంది. ఈ పోస్టులలోకి వస్తున్న వారు కూడా క్రేజ్ ఉన్న వారే ఉంటున్నారు. ఒకప్పుడు ఎపుడో రాజకీయ సర్దుబాటులో భాగంగా ఈ పదవులు చాలా అరుదుగా క్రియేట్ చేసేవారు. ఇపుడు మాత్రం సీఎం పక్కన డిప్యూటీ ఉండాల్సిందే. అలా కాకుండా తొమ్మిదేళ్ళ ఏకచత్రాధిపత్యంగా ఉమ్మడి ఏపీని ఏలిన చంద్రబాబు కూడా విభజన ఏపీలో డిప్యూటీ సీఎంలను పెట్టుకున్నారు. జగన్ తొలిసారి సీఎం అయినా వెంట అయిదుగురు డిప్యూటీలు ఉండేవారు. ఇక తమిళనాడులో కూడా డిప్యూటీ సీఎంల వరస డీఎంకే నుంచే స్టార్ట్ అయింది. కరుణానిధికి స్టాలిన్, అలాగే స్టాలిన్ కి ఉదయనిధి డిప్యూటీలుగా పనిచేశారు. మరి తమిళనాడులో ద్రవిడ పార్టీల రాజకీయానికి ముగింపు పలికి కొత్త రాజకీయానికి బాటలు వేసిన దళపతి విజయ్ కేబినెట్ లో కూడా డిప్యూటీ సీఎం ఉంటారా అన్న చర్చ నడుస్తోంది.మూడు దేశాల్లో మూడు దారుణ ఘటనలు ఆమె ఆ పదవిలో : ఇక విజయ్ సీఎం గా ఉంటే డిప్యూటీ ఎవరు అంటే ఎవరో కాదు ఆమె డిప్యూటీ సీఎం అవుతారు అని విపక్షం జోస్యం చెబుతోంది. త్రిషను తొందరలో డిప్యూటీ సీఎం గా చేసేట్టు ఉన్నారు అని అన్నది అన్నా డీఎంకేకి చెందిన మాజీ మంత్రి ఉదయకుమార్. ఆయన జోస్యంగా కంటే సెటైరికల్ గా ఈ కామెంట్స్ చేశారు. విజయ్ ధోరణి చూస్తుంటే తన సినీ సన్నిహితులను స్నేహితులను తెచ్చి కీలక పదవులు కట్టబెడుతున్నారు అని ఉదయకుమార్ మండిపడ్డారు. ఆయన ఆగ్రహానికి కారణం తాజాగా ఢిల్లీలో తమిళనాడు ప్రభుత్వ ప్రతినిధిగా కన్నడ రాష్ట్రానికి చెందిన ప్రముఖ నిర్మాత కేవీఎన్ ప్రొడక్షన్స్ అధినేత వెంకట నారాయణ్ ని సీఎం విజయ్ నియమించారు. దాంతో పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగుతున్నాయి. ఎనిమిది కోట్ల దాకా జనాభా ఉన్న తమిళనాడులో ఈ కీలక పోస్టుకు ఒక్క తమిళుడు దొరకలేదా అని అంతా విమర్శిస్తున్నారు. దాంతో అన్నా డీఎంకే దీనిని పట్టుకుని విజయ్ మీద విమర్శలు తనదైన శైలిలో ఎందగట్టింది. త్రిషకు కూడా ఇచ్చేస్తారు : తన సన్నిహితులకు పదవులు కట్టబెట్టే క్రమంలో రాబోయే రోజులలో త్రిషను ఉప ముఖ్యమంత్రిగా చేసినా ఆశ్చర్యం లేదని మాజీ మంత్రి ఉదయకుమార్ ఘాటైన కామెంట్స్ చేశారు. ఆయన చేసిన ఈ కామెంట్స్ అయితే ఇపుడు తమిళనాడులో టాక్ ఆఫ్ ది స్టేట్ గా మారిపోయాయి. త్రిష విజయ్ వెండి తెర మీద క్రేజీ జంట. ఇపుడు ఆ ఇద్దరికీ కలిపి సీఎం డిప్యూటీ సీఎం అని ఉదయకుమార్ పేల్చిన సెటైర్ అయితే బాగా మారు మోగుతోంది. కుదిరే వ్యవహారమేనా అయితే త్రిష ఉప ముఖ్యమంత్రి కావాలంటే ఆమె ఎమ్మెల్యేగా ముందు గెలిచి తీరాలి. తమిళనాడులో శాసనమండలి లేదు. అయితే విజయ్ రాజీనామా చేసిన తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గం నుంచి ఆమె పోటీ చేయాలి. ఆ మేరకు ఆమెకు టికెట్ ఇస్తేనే రేపటి రోజున కేబినెట్ లో చోటు దక్కుతుంది.

# 'విశ్వనాథ్ & సన్స్' కోసం గాయకుడిగా మారిన స్టార్ హీరో ?



తమిళ హీరో సూర్య 'కరుప్పు' విజయంతో జోరుమీదున్నాడు. ప్రస్తుతం తన తదుపరి సినిమా 'విశ్వనాథ్ & సన్స్' చిత్రంతో ప్రేక్షకులను అలరించడానికి ఆయన రెడీ అవుతున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ భారీ చిత్రంలో మమితా బైజు కథానాయికగా నటిస్తోంది. ఐతే, సూర్య అభిమానుల కోసం సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఓ ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. ఈ చిత్రం కోసం సూర్య ఒక ప్రత్యేకమైన డ్యాన్స్ నంబర్‌ను (పాటను) పాడారని ఆయన వెల్లడించారు.'యూత్' సినిమాతో గుర్తింపు పొందిన నటుడు, దర్శకుడు మరియు గీత రచయిత కెన్ కరుణాస్ ఈ పాటను రచించారు. 2014లో వచ్చిన 'అంజాన్' చిత్రంలోని 'ఏక్ దో తీన్' పాట తర్వాత, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతంలో సూర్య మళ్లీ గాయకుడిగా మారడం విశేషం. ఈ వార్త మొత్తానికి సూర్య అభిమానులలో ఎంతో ఉత్సాహాన్ని నింపింది.

# 'గాడ్ ఆఫ్ వార్' అప్ డేట్ కి టైమ్ లాక్ !



ఎన్టీఆర్ అభిమానులు చాలా కాలంగా ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. ఈ సినిమాకు సంబంధించిన ప్రకటన ఈ రోజే ఉంటుందని నిర్మాత నాగ వంశీ ఇప్పటికే ధృవీకరించారు. ఎన్టీఆర్ తో 'అరవింద సమేత' తర్వాత దర్శకుడు త్రివిక్రమ్ చేస్తున్న సినిమా 'గాడ్ ఆఫ్ వార్'. ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ అప్ డేట్, ఈ రోజు సాయంత్రం 5:04 గంటలకు రాబోతుంది. ఎన్టీఆర్ నుంచి రానున్న అప్ డేట్ కి టైమ్ లాక్ అయ్యాక, అభిమానుల్లో ఉత్సాహం తారాస్థాయికి చేరింది.ఇంతకీ, ఎనౌన్స్ మెంట్ పోస్టర్ వదులుతారా ?, లేక ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తారా ?, కేవలం సినిమాని ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తారా ?, లేక మరో సర్‌ప్రైజ్ ఉంటుందా ? అనేది చూడాలి. ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం అత్యంత భారీ స్థాయిలో రూపొందుతోంది

# దీవాన బాక్సాఫీస్.. వీకెండ్ తర్వాత కూడా అలానే..



హర్షిత్ రెడ్డి, స్నేహ మణిమేగలై నటించిన దీవాన సినిమా జూన్ 20న థియేటర్లలోకి వచ్చిన సంగతి తెలిసిందే.హర్షిత్ రెడ్డి, స్నేహ మణిమేగలై నటించిన దీవాన సినిమా జూన్ 20న థియేటర్లలోకి వచ్చిన సంగతి తెలిసిందే. శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వంలో ఒక స్వచ్ఛమైన ప్రేమకథగా తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పుడు రెండో వారంలోకి అడుగుపెట్టింది. సాధారణంగా ఎలాంటి పెద్ద స్టార్ కాస్ట్ లేని చిన్న సినిమాలకు తొలి వీకెండ్ తర్వాత థియేటర్ల దగ్గర సందడి పూర్తిగా తగ్గిపోతుంది. కానీ దీవాన విషయంలో అలా జరగకుండా బాక్సాఫీస్ దగ్గర చాలా స్టెడీగా రన్ అవుతుండటం హైలెట్. కొత్త వాళ్లతో తీసిన లవ్ స్టోరీలకు పబ్లిక్ నుంచి వచ్చే మౌత్ టాక్ చాలా కీలకం అవుతుంది. ఈ సినిమాకు మొదటి రోజు నుంచే ఆడియన్స్ నుంచి పాజిటివ్ వైబ్ రావడంతో ఆ ఎఫెక్ట్ ఇప్పుడు థియేటర్ల దగ్గర క్లియర్ గా కనిపిస్తోంది. భారీ ఎత్తున ఓపెనింగ్స్ రాకపోయినా కంటెంట్ నచ్చడంతో జనాలు నెమ్మదిగా థియేటర్ల వైపు వస్తున్నారు. వీకెండ్ హాలిడేస్ పూర్తయిన తర్వాత కూడా సోమవారం లాంటి వర్కింగ్ డేస్ లో డీసెంట్ కలెక్షన్స్ వస్తుండటం మేకర్స్ కు పెద్ద రిలీఫ్ ఇస్తోంది. ఆన్లైన్ టికెటింగ్ ప్లాట్ ఫామ్ బుక్ మై షో లో గమనిస్తే ఈ సినిమా బుకింగ్స్ పరిస్థితి చాలా పాజిటివ్ గా ఉన్నట్లు తెలుస్తోంది. వీకెండ్ హడావుడి తగ్గిన తర్వాత కూడా చాలా ఏరియాల్లో టికెట్లు ఆశాజనకంగా అమ్ముడవుతున్నాయి. గత 24 గంటల్లో బుకింగ్స్ లెక్క 6.82K రేంజ్ లో ఉండడం విశేషం. ఆడియన్స్ నుంచి వస్తున్న కంటిన్యూస్ రెస్పాన్స్ తో ఈ యాప్ లో సినిమా ట్రెండింగ్ లోనే కొనసాగుతోంది. దీన్ని బట్టి కేవలం యూత్ మాత్రమే కాకుండా ఫ్యామిలీ ఆడియన్స్ కూడా ఈ సినిమాను చూడటానికి బాగానే ఆసక్తి చూపిస్తున్నారని మనకు అర్థమవుతోంది. ఒక యువకుడు తన ప్రేమ కోసం పడే ఆరాటం ఆ తర్వాత అనుకోకుండా పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కడం లాంటి పాయింట్స్ నేటి జనరేషన్ కు బాగా కనెక్ట్ అయ్యాయి. దర్శకుడు ఎంచుకున్న కథలో ఉన్న రియాలిటీకి కాస్త కమర్షియల్ హంగులు కూడా తోడవడంతో సినిమా బోర్ కొట్టకుండా సాగుతుంది. ముఖ్యంగా సినిమా సెకండాఫ్ లో వచ్చే ఎమోషనల్ సీన్స్ ప్రేక్షకులను ఆలోచింపజేసేలా ఉండటం ఈ సినిమా స్టెడీ రన్ కు అసలైన కారణం అని చెప్పవచ్చు. సినిమా రిలీజ్ తర్వాత నెగటివ్ ప్రచారంపై డైరెక్టర్ చేసిన ఎమోషనల్ కామెంట్స్ కూడా సినిమాకు ఒక రకంగా ప్లస్ అయ్యాయి. కంటెంట్ మీద పూర్తి నమ్మకంతో సినిమా తీశామని థ్యాంక్యూ మీట్ లో మూవీ టీమ్ పదే పదే చెప్పడంతో జనాల్లో కూడా ఈ సినిమా కచ్చితంగా చూడాలనే క్యూరియాసిటీ పెరిగింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS, 6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL, TELANGANA-506001. PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONDA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com